

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 34 పుష్పం : 41 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, మహేంద్రవాడ, 15-7-99)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలనుకొనేవారికి నిర్వాణస్థితిని పొందాలనుకొనే వారికి లక్షణత్రయం అవసరము. 1. అహింస, 2. మైత్రి, 3. కరుణ. అహింస అంటే మన మాట ద్వారా గాని, చేత ద్వారా గాని, మనస్సు ద్వారా గాని ఇతరులను హింసకు గురిచేయకూడదు చేతనయితే సహాయం చేయాలి గాని హింసకు గురిచేయకూడదు. మన మనస్సు ఒక రకంగా ఉంటుంది. మాట ఒకరకంగా ఉంటుంది. రెండింటికి సమన్వయం కుదరదు. అది పెద్దలోటు.మన మనస్సుకు, మాటకు, చేతకు సమన్వయం ఉండాలి. అది కూడా అధ్యాత్మిక సాధన. ఆధ్యాత్మిక సాధన అంటే మూడుపూటల భోజనం చేసి మొద్దులా కూర్చోవటం కాదు, ఏదో కొండగుహలో కూర్చోవటం కాదు, సమాజంలో ఉంటూనే ఎంతో కొంత స్వార్థం తగ్గించుకొని సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి. శాస్త్రాన్ని దగ్గరపెట్టుకొని, భగవంతుని మాటలను దృష్టిలో పెట్టుకొని మన అలవాట్లు మార్చుకోవాలి. ఎందుచేతనంటే మన శరీరాన్ని దహనం చేసినప్పుడు మనస్సులో ఉన్న అలవాట్లు దహనం చేయబడవు, శరీరం ఉండగానే ప్రయత్నం చేసి అలవాట్లను తొలగించుకోవాలి. మైత్రి అంటే జగత్తులో ఉన్న ప్రతీ ప్రాణి యొక్క హితవుకోరాలి, అందరి పట్ల ప్రేమ కలిగి ఉండాలి. మనం ఎవరితోనూ విరోధం పెట్టుకోకూడదు. దుష్టులపట్ల కూడా, మంచి గుణాలు లేనివారిపట్ల కూడా మనం ఉదాసీనంగా ఉండాలి గాని విరోధం పెట్టుకోకూడదు. ఎందుచేతనంటే విరోధం పెట్టుకొంటే మనస్సు హృదయగుహ లోనికి వెళ్ళకుండా ఎవరితో మీరు విరోధం పెట్టుకొన్నారో వారి మీదకు వెళ్ళివాలుతుంది, అంటే బాహ్యముఖమవుతూ ఉంటుంది, సాధనను భంగపరుస్తుంది. కరుణ అంటే దయ. ఇతరులు ఎవరైనా ఉద్రేక పరిచినా మనం ఎక్కువగా ఉద్రేకపడకూడదు. దాని వలన మనలో కాఠిన్యం వస్తుంది. అందుచేత దయను అభ్యాసం చేయాలి. మీరు ఇతరుల పట్ల దయ చూపిస్తూ ఉంటే భగవంతుడు మీపట్ల దయచూపిస్తాడు. మనం ఇతరులపట్ల దయచూపించము, ప్రేమ చూపించము కాని మా పట్ల దయచూపించమని భగవంతుడిని అడుగుతాము. నీవు ఇతరులపట్ల చూపించనిది భగవంతుడిని కూడా నీవు అడుగకూడదు.

దేహం పుట్టింది, దేహం మరణిస్తుంది. ఆ పుట్టింది నీవుకాదు చనిపోయేది నీవు కాదు. నీకు అసలు జననం లేదు, మరణం లేదు, ఒక్క గాఢనిద్రలో తప్పించి మిగిలిన కాలం అంతా జాగ్రదావస్థలో దేహంతో తాదాప్యం పొందటం వలన నేను పుట్టాను, నేను చనిపోతున్నాను అనిపిస్తోంది. రాత్రి నిద్రలో కలలు వస్తూ ఉంటాయి. అది నెంబరు 1 కల. ఈ జాగ్రదావస్థ

కూడా కలే. ఇది నెంబరు 2 కల అన్నారు భగవాన్. వీటికి తేడా ఏమిటి అంటే నెంబరు 1 కల పొట్టిగా ఉంటుంది, నెంబరు 2 కల పొడవుగా ఉంటుంది. చనిపోవటం, పుట్టటం కూడా నిజంకాదు. కలలో భాగమే. దేహంతో తాదాప్యం వలన నేను పుట్టాను అంటున్నావు. నీకు పుట్టుక లేదు, మరణం లేదు, నీవు ఆత్మస్వరూపుడవు. ఇది నీకు తెలియాలంటే ఆచార్యులవారు, బుద్ధుడు, భగవాన్ పఠాలను పెట్టుకొని వాటిని చూస్తూ ఉంటే మనం కూడా అలా అవ్వాలి, అంతలోతులకు వెళ్ళాలి అనే కాంక్ష మీ హృదయంలోనుండి పుడుతుంది. శరీరం మరణించక ముందే మనస్సులో ఉన్న బలహీనతల నుండి దోషాలనుండి మనస్సును కొంచెం తప్పించాలి. చెడు కర్మలకు, చెడు ఆలోచనలకు ఎవడైతే దూరంగా ఉంటాడో వాడి మనస్సును హృదయగుహ ఆకర్షించుకొని తనలోనికి లాక్కొని మనస్సును నశింపజేసి తన స్వరూపం ఇస్తుంది. మీరు జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటారు. దీనివలన మనస్సు హృదయ గుహలోనికి వెళ్ళకుండా ఆగిపోతుంది. ఈ చిన్నచిన్న విషయాలను సరిగా అర్థం చేసుకోండి. బండతనంగా చేస్తే ఇది రాదు.

What is God అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఉపనిషత్‌లలో ఇలా ఉంది, వేదాలలో ఇలా ఉంది అని ఆయన ఏమీ చెప్పలేదు. నీ ప్రశ్నకు సమాధానం నేను చెప్పనక్కరలేదు. నీ ప్రశ్నలోనే జవాబు ఉంది అని భగవాన్ చెపుతూ భగవాన్ ఏమన్నారు అంటే What is God అంటే What is......is God అంటే ఏదైతే ఉందో అదే దేవుడు. నీ మనస్సులో వచ్చే ఆలోచనలతో సంబంధం లేకుండా, చావు పుట్టుకలు, దేశకాలములకు అతీతంగా సర్వకాల సర్వావస్థలలో ఏది అయితే ఉందో అదే దేవుడు. నీ మనస్సులో ఉన్న బలహీనతలనుండి బయటకు రావటానికి బహుజన్మల కృషి అవసరం. నీవు బహుజన్మలు సాధన చేయగా చేయగా నీ మనస్సు పవిత్రం అవుతుంది, నీ మనస్సుకు పక్వత కలుగుతుంది. నీకు పక్వత వచ్చిన మరుక్షణంలో ఈశ్వరుడు నీ హృదయంలోనే వ్యక్తమవుతాడు. నీకు తెలిసినా తెలియకపోయినా, నీవు మంచి వాడిగా ఉన్నా చెడ్డవాడిగా ఉన్నా పరమేశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు. ఏదైతే ఉందో, ఎవడినైతే ఈశ్వరుడు అనుకొంటున్నామో, ఏ చైతన్యం అయితే ఈ లోకంఅంతా వ్యాపించి ఉందో ఒక్కసారి ఆ చైతన్యం మన హృదయంలో స్ఫురిస్తే ఆ రోజున మనం జననమరణ ప్రవాహంలోనుండి, అజ్ఞానంలోనుండి బయటకు వస్తాము.

పరమేశ్వరుడి మీద మనకు నమ్మకం లేదు. ఆయన చెప్పిన మాటల మీద మనకు నమ్మకం లేదు. ఒకసారి మాటల సందర్భంలో ద్రౌపతితో కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే ద్రౌపతీ పైనున్న లోకాలు అన్నీ తెగిపోయి క్రిందపడినా, ఈ భూమి అంతా ముక్కలు ముక్కలుగా విరిగిపోయినా, సముద్రాలు అన్నీ ఎండిపోయినా నేను చెప్పిన మాటకు తిరుగులేదు. అవి అన్నీ అసత్యాలు కావచ్చు కాని నామాట వాస్తవం. ఒకవేళ నేను చెప్పిన మాట నీకు అర్థంకాకపోతే వెయ్యి జన్మలు ఎత్తినతరువాత నీవు పవిత్రురాలవు అయినతరువాత నా మాటలు నీవు అంగీకరించవలసిందే. నా మాటలు నీకు అర్థంకావటం లేదు అనుకో అవి అసత్యం అనుకోవద్దు, నీ మనస్సులో దోషం ఉంది అనుకో, నా మాటను అర్థంచేసుకొనే శక్తి నీకులేదు

అనుకో, నా మాట సజీవమైన సత్యం ద్రౌపతీ నమ్మినవారు ధన్యులు, నమ్మినవారు అదృష్టవంతులు, సాధన అంటే ఏమిటి? మీరు భోజనం మానివేయటం, ఉదయం మొదలు సాయంత్రంవరకు పూజలు చేయుటం సాధన కాదు. మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో తెలుసుకోవాలి. భగవదనుభవం కలగటానికి వ్యతిరేఖమైన అలవాట్లు, దోషాలు ఏమిఉన్నాయో వాటిని బయటకులాగి కాల్చిబూడిదచేయాలి. అప్పుడు మీకు భగవదనుభవం కలుగుతుంది. మనస్సులో ఉన్నబలహీనతలను తొలగించుకోమంటున్నారు ఎలా తొలగించుకోవాలి? పరమేశ్వరుడిని ప్రార్థించు, జపంచెయ్యి, ధ్యానం చెయ్యి. ఇవి చేయలేకపోతే సత్పురుషుల సహవాసం చెయ్యి, అందరి హితవు కోరుకో. నీవు అందరి హితవు కోరుతూ ఉంటే, భగవంతుడిని స్మరిస్తూ ఉంటే పాపంలోనుండి బయటకు వచ్చేస్తావు. అప్పుడు పరమేశ్వరుడు తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు.

మీరు జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయం ఏమిటి అంటే మీరు దేనికోసమైతే పూజలు చేస్తున్నారో, దేనికోసమైతే జపాలు చేస్తున్నారో అది ఎవరు? అది మీరే. అయితే అది మీకు ఎందుకు తెలియటంలేదు? దేహాభిమానం వలన మనకు తెలియటంలేదు. అందువలన సాధన చేసి దేహాభిమానాన్ని తొలగించుకోవాలి. అంతటా ఉన్న వస్తువు, ఆపరమార్థం ఒక్కసారి మన హృదయంలో స్ఫురిస్తే అప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా ఒక్కటే, చైతన్యం ఒక్కసారి స్ఫురిస్తే మీరు కోరదగినదంటూ ఏమీ ఉండదు. ఎప్పుడైతే హృదయంలో ఉన్న సత్యం నీకు స్ఫురించిందో అప్పుడు మనస్సు అది ఎక్కడయితేపుట్టి వస్తోందో అక్కడకు వెళ్లటం ప్రారంభిస్తుంది.

నీవు ఎవరిగా ఉన్నావో వారిగా ఉండటానికి, నీలోపల ఏదైతే నిజం ఉందో దానిని తెలుసుకోవటానికి ఈ బల్లి నేనును, అసత్యమైన నేనును మర్చిపోవలసిన అవసరం నీకు లేదా? Shall we not forget the little I to be Real self. నీలో ఉన్న నిజమైన నేనును తెలుసుకోవటానికి ఈ చిన్న నేనును, అబద్ధమైన నేనును మర్చిపోవలసిన బాధ్యత నీకు లేదా? దానిని మర్చిపోవటానికి నీవు అభ్యాసం చేయనక్కరలేదా? భక్తివలన ముక్తి వస్తుంది. నిజంగా కొంతమంది నాకు భక్తే చాలు అనుకొనే వారు ఉన్నారు. మినహాయింపులు లేని శరణాగతి హృదయంలో ఎలా ఉంటుంది అంటే భగవాన్‌తో ఒక భక్తుడు అన్నాడు నేను మోక్షం కోసం కంగారు పడటంలేదు. నేను ఏజన్మలో ఉన్నా పశువుగా ఉన్నా లేక మరో శరీరంలో ఉన్నా నీ మీద భక్తి చెదరకుండా ఉండేటట్లు చూడు. మనిషిగా ఉండి నీ మీద భక్తి లేకపోవటంకంటే ఏ శరీరంలో ఉన్నా నీ మీద భక్తి కలుగజెయ్యి భగవాన్ అని అడిగాడు. ఈ జన్మలోనే తరింపజేయమని అడగటంలేదు కాని వెయ్యిజన్మల తరువాత అయినా నీ ద్వారానే నేను తరించాలి. అది పరిపూర్ణమైన విశ్వాసం. మనకు ప్రేమ ఉంది, ఎంతో కొంత భక్తి ఉంది కాని అది స్కిన్ డీప్ లవ్ అంటే చర్మం ఎంత లోతు ఉంటుందో మన భక్తి కూడా అలా ఉంది. చర్మంకు లోతు ఉండదు, చాలా పల్చగా ఉంటుంది. మనం పనిచేస్తాము కాని చిరాకుగా చేస్తాము. What is Work అని భగవాన్ ను అడిగితే Love is work అని చెప్పారు. అంటే నీవు ప్రేమగా చేసేది, నిర్మలంగా చేసేది కర్మ. ప్రేమ లేకుండా చేస్తే అది ఖర్మ.

నీవు ఆత్మవు, నీవు ఆత్మవు అని మీరూ చెపుతున్నారు, కృష్ణుడూ చెప్పాడు. నేను ఆత్మను అయితే అది నాకు ఎందుకు తెలియటంలేదు. కొంతమందిని చూస్తే ముద్దుపెట్టుకోవాలి అనిపిస్తోంది. కొంతమందిని చూస్తే శరీరం మండిపోతోంది. అందరూ ఆత్మే అంటున్నారు. నన్నూ ఆత్మే అంటున్నారు ఇది ఏమిటి అని అడుగుతున్నాడు. నాకు ఎవరిని చూస్తే ముద్దు పెట్టుకోవాలని ఉందో, ఎవరిని చూస్తే శరీరంలో మంటపుడుతోందో వారిలోనూ ఆత్మే ఉంది, నీలోనూ ఆత్మే ఉంది అని పెద్దలు చెపితే తెలుస్తోంది గాని మంట తగ్గటంలేదు అంటున్నారు భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు ఇతరుల పట్ల మంచి ఆలోచనలు వచ్చినా, చెడు ఆలోచనలు వచ్చినా నీవు ఆత్మవే. దానిని నీవు కుదించేసుకొని, పొట్టి చేసుకొని నీవు ఆత్మవు అయినప్పటికి దానిని దేహానికి పరిమితం చేసుకొంటున్నావు. అనంతమైన ఆత్మను తీసుకొనివచ్చి ఈ తక్కుకు పరిమితం చేస్తున్నావు. ఈ దేహానికి పరిమితం చేయటం మానివేస్తే ఏమీ లేదు. పరిమితం చేసుకొంటే తుక్కు. పరిమితం చేయకపోతే ఆత్మ. ఎంత అందంగా చెపుతున్నారో చూడండి. ఆత్మనే శరీరానికి పరిమితం చేస్తే మనస్సు, పరిమితం తీసివేస్తే ఆత్మ అంతకంటే ఏమీ లేదు. పరిమితం చేసుకోవటం మానివేస్తే శరీరం మంట తగ్గిపోతుంది. నీ హృదయంలో ఏమి ఉందో నీకు తెలియటంలేదు. నీ హృదయంలో ఏమి ఉందో నీకు తెలిస్తే అప్పుడు వారిలో ఉన్న వికారములు చూడవు, వారి శరీరాలు చూడవు. నీ హృదయంలో ఉన్నది వారి హృదయంలో ఉన్నది ఒక్కటే అని నీకు అర్ధమయినప్పుడు నీకు మంటలు రావు, ముద్దు పెట్టుకోవలసిన పనిలేదు, ఆధ్యాత్మిక సాధనలు ఎందుకు? సత్పురుషుల సహవాసం ఎందుకు? మీ పూర్వజన్మలనుండి వస్తున్న వాసనలను బయటకులాగి మంటపెట్టటానికే ఆధ్యాత్మిక సాధనలు. వాటి ప్రయోజనం అదే. మనకు రెండు విద్యలు ఉన్నాయి. వృత్తివిద్య, ఆత్మ విద్య,వృత్తి విద్య నేర్చుకొంటేపొట్ట వెళ్ళిపోతుంది. ఆత్మ విద్య నేర్చుకొంటే మోక్షం కలుగుతుంది.

నాకు మనస్సులో శాంతి లేదు అని ఒకరు భగవాన్‌ను అడిగితే మనస్సులో శాంతి ఎక్కడ ఉంది, మనస్సు ఎక్కడ పుడుతోందో అక్కడికి వెళ్ళు, అక్కడకు వెళితే మనస్సు నశిస్తుంది, అప్పుడు నీకు శాంతి దొరుకుతుంది. మనస్సు ఎక్కడపుడుతోందో అక్కడ శాంతి ఉంది ఎందుచేతనంటే అక్కడే పరమాత్మ ఉన్నాడు. వేటగాడు జంతువును ఎలా వెంటాడుతాడో అలాగ మనస్సును వెంటాడుతూ వెంటాడుతూ దాని పుట్టుచోటుకు వెళ్ళు అక్కడ మనస్సు నశిస్తుంది, అప్పుడు శాంతి దొరుకుతుంది. ఎవరు గురువు అంటే శరీరం ఉండగా ఈ భూమిమీద అటు ఇటు తిరుగుతున్నప్పుడే ఎవడైతే మోక్ష సుఖాన్ని తన హృదయంలో అనుభవిస్తున్నాడో వాడే గురువు. మీకు ఏరకమైన స్వార్ధం లేదు అనుకోండి, మీ మనస్సులో ఏవాసనలు, అలవాట్లు లేవు అనుకోండి ఈ శరీరం ఏమి చేసుకొంటారు. కొంతమంది కొంపలకు అస్తమానూ చుట్టాల గొడవే. భార్య తరుపువారో, భర్త తరుపు వారో ఎవరో ఒకరు సిద్దమవుతూ ఉంటారు. ఒకరిని సాగనంపే సరికి ఇంకొకరు సిద్దమవుతూ ఉంటారు. ఒకరోజు భార్య భర్త అనుకొన్నారట ఈ చుట్టాల గొడవ పడలేక పోతున్నాము, చాలా ఎక్కువగా ఉంది. రావద్దు అంటే మర్యాదగా ఉండదు. మనం ఏమిచేద్దాము అంటే చుట్టాలు వచ్చేటప్పటికి

ఒకరిని ఒకరు గట్టిగా తిట్టుకొందాము. నీకు బుద్ధిలేదా అంటే నీకు బుద్ధిలేదా అని ఇద్దరం తిట్టుకొందాము. నటన కోసం అలా చేద్దాము గట్టిగా తిట్టుకొందాము అది చూసివారు గొడవలు పడుతున్నారు మనం ఎందుకు అని చుట్టాలు వెళ్ళిపోతారు అని అనుకొన్నారట. అలాగే చుట్టాలు ఎవరైనా వస్తే తిట్టుకొనే వారట అది చూసి వారు వెళ్లి పోయేవారట, కాని ఒకరోజున ఒక తెలివైన చుట్టం వచ్చాడట. వీరు తిట్టుకొంటూ ఉంటే వాడు ఒక ప్రక్కకు తప్పుకొన్నాడట. తిట్టుకోవటం నటనకదా కొద్దిసేపు అలా తిట్టుకొన్నాక వాడు వెళ్ళిపోయాడు అనుకొని వీరు సరదాగా కబుర్లు చెప్పుకొంటున్నారట. అప్పుడు ఆ చుట్టం సిద్దమయ్యాడట. అప్పుడు వాడు మీరు తిట్టుకోవటం నటనే, నేను వెళ్ళిపోవటం నటనే. తిరిగి వచ్చేసాను సాపాటు తప్పదు అన్నాడట. నేను గురించి మనం చేసే సాధనలు కూడా అలాగే ఉన్నాయి. నేను గురించి మనం ఏదో సాధనలు చేస్తాము. అది తెలివైన చుట్టంలాగ ప్రక్కకు తప్పుకొంటుంది. సాధన అయిపోయిన వెంటనే ఇక్కడే ఉన్నాను అని వచ్చేస్తుంది. మనం పూజ గదిలో నుండి బయటకు వచ్చిన మరుక్షణంలో వచ్చేస్తుంది.

చలంగారు ఏమిచెప్పేవారు అంటే భగవాన్ ఎవరో నాకు అక్కరలేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కరలేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కరలేదు. ఆయన నాకు ఆనందసముద్రం. ఆయన నుండి శాంతి, కాంతి వస్తోంది. ఆయన శాంతి దాత. అంతే కాదు నన్ను కర్మఫలదాత దగ్గరకు తీసుకొని పోతున్నాడు అన్నారు. ఎంత అందంగా చెప్పాడో చూడండి. ఈ జన్మలకు, దుఃఖానికి, ద్వేషాలకు అన్నింటికి మిధ్యానేను కారణం. దానిని వైరాగ్యబలంతో, అభ్యాస బలంతో తొలగించుకో. అదిపోయిన మరుక్షణంలో సత్యమైననేను నీ హృదయంలో వ్యక్తమవుతుంది. దానికి హద్దులు లేవు, పరిమితులు లేవు. అది లేనిచోటు అంటూలేదు. నిన్ను నీవు ఉద్ధరించుకోకపోతే ఎవరు నిన్ను ఉద్ధరిస్తారు. ఎవరో వచ్చి ఉద్ధరిస్తారు అనికనిపెట్టుకొని ఉండకూడదు. మనలను మనం ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరానుగ్రహం వస్తుంది. మనకు ఏదైనా మంచి జరిగితే అది ఈశ్వరానుగ్రహం అనుకొంటాము. ఏదైనా చెడ్డజరిగితే అది అనుగ్రహంకాదు అనుకొంటాము. మనకు కలిగిన చెడ్డకూడా ఈశ్వరానుగ్రహమే అని నీవు గుర్తించ గలిగితే మనస్సు చల్లారిపోతుంది. మనకు దుఃఖం వస్తే, ఇంట్లో ఎవరికైన బాధవస్తే ఇదికూడా ఈశ్వరానుగ్రహమే. ఈశ్వరునికి తెలియకుండా ఈ బాధ ఎందుకు వస్తుంది. ఇది కూడా ఈశ్వరానుగ్రహమే అని గుర్తించిన వారు ధన్యులు.

నన్ను ధ్యానం చేసుకోమంటారా అని ఒకరు భగవాన్‌ను అడిగితే దేనిని ధ్యానం చేస్తున్నావు అన్నారు.ఆత్మను ధ్యానం చేస్తున్నాను, చైతన్యాన్ని ధ్యానం చేస్తున్నాను అని చెప్పాడు. ధ్యానం చెయ్యి మంచిదే నీవు దేనినైతే ధ్యానం చేస్తున్నావో అదీ నీవు ఒకటే అన్న సంగతి నీకు తెలియటం లేదు. అదీ నీవు ఒక్కటే అని నీకు గ్రహింపుకువస్తే అదే నీకు కడసారి జన్మ. ఒక భర్త భార్యతో అన్నాడు నీవు ఎప్పుడూ జ్ఞానం జ్ఞానం అంటున్నావు. డబ్బువిలువ నీకు తెలియటం లేదు. లోకం పోకడ నీకు తెలియటం లేదు. నీలో ఏమైనా మంచి గుణాలు ఉన్నాయి అనుకో ధనం

లేకపోతే అవి ప్రకాశంలోనికి రావు, లోకం వాటిని గుర్తించదు. ధనం ఉంటే గుర్తిస్తుంది అని చెప్పాడు. అప్పుడు భార్య ఏమి చెప్పింది అంటే ఇవి అన్నీ లౌకిక విషయాలు లోకం ఒకటి ఉంది ఏమిటి గుర్తించటానికి. నాదగ్గర ధనం ఉంది అనుకోండి ధనం ఉంది అని చెప్పుకొంటే నా అహంకారం సంతోషిస్తుంది. లోకం అంటే ఏమీలేదు అహంకారమేలోకం అని చెప్పింది. లోకం అంటే ఏదో ఉంది అనుకొంటున్నారు. మీ అహంకారమును తీసి ఒకప్రక్కనపెట్టి అప్పుడు లోకం ఉందేమో నాకు చూపించండి అంది. ధనం ఉంటే లోకం గుర్తిస్తుంది అందువలన ధనాన్ని కోరుకో అని భర్త చెపుతూ ఉంటే ధనం వలన మోక్షం రాదు, జ్ఞానం వలన మోక్షం వస్తుంది అందువలన జ్ఞానాన్ని కోరుకొంటున్నాను అని భార్య చెపుతోంది. ధనానికి విలువ లేదు అని నేను అనటం లేదు. ఈ దేహం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో ఆ ధనం కూడా అంతే నిజం. అది పారమార్ధిక సత్యంకాదు.

నీ దేహం ఎక్కడ పుట్టిందో నీకు తెలుసు. కాని నేను ఎక్కడ పుట్టిందో నీకు తెలియటం లేదు. దేహం ఎక్కడ పుట్టిందో ఆ పుట్టింటికి వెళ్ళటం నేర్చుకొన్నావు. నేను అనే తలంపు ఎక్కడ పుట్టిందో ఆ పుట్టింటికి వెళ్ళటం కూడా నేర్చుకో. నేను పుట్టుచోటు తెలుసుకో. నీకు ఎడ్రసు తెలియకపోతే పెద్దలను అడిగి తెలుసుకో. సాధనలో అన్నింటికంటే ఏది చాలా కష్టం అని భగవాన్‌ను అడిగితే మన శరీరంలో చాలా ఇంద్రియాలు ఉన్నాయి. ఒకో ఇంద్రియానికి ఒకో విషయం ఉంటుంది. ఆ విషయంలో నుండి ఆ ఇంద్రియాన్ని తప్పించటం చాలా కష్టం అని చెప్పారు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. చదివే పుస్తకాల విషయంలో జాగ్రత్తగా ఉండండి. స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి. కొన్ని స్నేహాలు ఎలా ఉంటాయి అంటే గొయ్యి ఉండిపైన గడ్డి వచ్చింది అనుకోండి. గడ్డేకదా అని మనం కాలు వేస్తే గోతిలో పడతాము. కొన్ని స్నేహాలు అలా ఉంటాయి అందువలన స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి. భగవంతుని నామం ఎందుకు అంటే మీరు నీరు పెట్టి ఇల్లు ఎలాకడుక్కొంటున్నారో భగవంతుని నామం మీ మనస్సును కడుగుతుంది. పవిత్రమైన నామాన్ని స్మరించినప్పుడు మీకు తెలియకుండా మీలోని లోపాలు రాలిపోతాయి. స్త్రీకి భర్త ఎవరు అంటే శాంతి. భర్తకు భార్య ఎవరు అంటే శాంతి. శాంతి కుదిరితే భర్తకు భార్యతో పనిలేదు. శాంతి కుదిరితే భార్యకు భర్తతో పనిలేదు. శాంతి కుదిరే వరకు ఒకరితో ఒకరికి పని ఉంటుంది అని ఒక మీటింగులో చెపితే తరువాత ఒకరు వచ్చి స్త్రీకి భర్త శాంతి అయితే నామాట ఏమిటి అని అడిగారు. ఆవిడకు ఆస్థితి కుదిరితే నీమాట ఈశ్వరుడు చూస్తాడు. నీ భార్యకు ఏ ఈశ్వరుడు అయితే ఆ స్థితిని కలుగజేసాడో వాడే నీ విషయంలోనూ జాగ్రత్త తీసుకొంటాడు. నిన్ను విడిచిపెట్టేయడు. మీరు ఏమీకంగారు పడవద్దు అని చెప్పాను.

Printed and published by P.S. Rama Raju at Shriram Graphics, Palakol ☎ 24776